సాక్షి
మెదక్
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



ఇల్లు కట్టు.. ఫొటో పెట్టు
ఇందిరమ్మ లబ్ధిదారులే యాప్ ద్వారా ఇళ్ల ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. వివరాలు 8లో ▸



ట్యాబ్ ఒక టీచర్‌తో సమానం
ఈ లర్నింగ్ ప్రోగ్రాంలో ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. వివరాలు 8లో ▸



రోడ్డెక్కిన రైతులు
బస్తా యూరియా కోసం పొలాల్లో ఉండాల్సిన రైతులు.. ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వివరాలు 9లో ▸

విష జ్వరాలతో విలవిల

ఆస్పత్రులు కిటకిట
- ఓపీ కేంద్రాల వద్ద రోగుల బారులు
- గంటల తరబడి నిరీక్షణ
- అరకొర మందులు.. వైద్య పరీక్షలు కరువు
- 'సాక్షి' విజిట్‌లో వెలుగుచూసిన వాస్తవాలు

జిల్లాను సీజనల్ వ్యాధులు వణికిస్తున్నాయి. జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పలువురు అనారోగ్యం బారిన పడుతున్నారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్, టైఫాయిడ్, మలేరియా, డెంగీతో బాధపడుతున్నారు. దీంతో ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఓపీ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఇదిలా ఉండగా అరకొర మందులు.. వైద్య సిబ్బంది కొరతతో అవస్థలు తప్పడం లేదు. వైద్య పరీక్షలకు రోగులు ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. సోమవారం పట్టణ ఆస్పత్రులను 'సాక్షి' విజిట్ చేయగా పలు విషయాలు వెలుగుచూశాయి.



తూప్రాన్ సీహెచ్‌సీలో రోగుల కిటకిట

రోగులకు పరీక్షే

తూప్రాన్: పట్టణంలోని సీహెచ్‌సీకి నిత్యం 600పైగా రోగులు వస్తున్నారు. వీరిలో ఎక్కువగా విష జ్వరాలే బాధితులే ఎక్కువ. ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడానికి కిట్లు కరువయ్యాయి. అలాగే మందులు కరువయ్యాయి. దీంతో కొంత మంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా రోగుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రిలోనే అన్నిరకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించే సదుపాయం కల్పించాలని బాధితులు కోరుతున్నారు.

మందు గోలీల్లేవ్!



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు

రామాయంపేట(మెదక్): సీజనల్ వ్యాధులతో పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రోగుల తాకిడి పెరిగింది. సోమవారం ఇద్దరు డాక్టర్లు విధుల్లో ఉన్నారు. రోజూ ఆస్పత్రికి 200కు పైగా రోగులు వస్తుండగా, సోమవారం 9:30 గంటల నుంచి 12 వరకు 155 మంది వచ్చారు. కొన్ని మందులు అందుబాటులో లేవు. ఈ ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్ పరిధిలో చేర్చి మూడేళ్లు కావొస్తుండగా, ఇది కాగితాలకే పరిమితమై సీహెచ్‌సీగానే కొనసాగుతోంది. నెలకు రెండు, మూడు కాన్పులు సైతం కావడం లేదు. ఎక్స్‌రే యంత్రం నిరుపయోగంగా ఉండగా, గైనకాలజిస్ట్ పోస్టు భర్తీ కాకపోవడం సమస్యగా మారింది.

ఓపీక నశిస్తోంది

నర్సాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతుంది. సోమవారం 740 మంది ఆస్పత్రిలో అవుట్ పేషెంట్లుగా నమోదు చేసుకున్నారు. వారిలో సుమారు 80 మంది విష జ్వరాలతో బాధపడుతున్నారు. సుమారు 20 మంది ఇన్ పేషెంట్లుగా చేరి వైద్యం పొందుతున్నారు. మిగిలిన వారు మందులు తీసుకొని ఇళ్లకు వెళ్లారు. ఇదిలా ఉండగా రోజుకు 60 నుంచి 80 మంది జ్వర బాధితులు ఆస్పత్రికి వస్తున్నారని, వారిలో 20 నుంచి 25 మంది ఇన్ పేషెంట్లుగా చేరి వైద్యం పొందుతున్నారని వైద్యులు తెలిపారు.



ఓపీ కోసం బారులు తీరిన రోగులు

అన్నీ.. సగం సగం



రోగులతో కిక్కిరిసిన జిల్లా కేంద్ర ఆస్పత్రి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్ర ఆస్పత్రి రోగులతో కిక్కిరిసింది. ప్రతి రోజు సుమారు 500 నుంచి 1,000 మంది వరకు వస్తున్నారు. సరిపడా మందులు కరువయ్యాయి. రక్త పరీక్షలు కొన్నింటిని ప్రైవేట్‌లో చేయించుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. యూరిన్ ఇన్‌ఫెక్షన్, ప్రమాదాల్లో గాయపడిన వారికి మందులు కరువయ్యాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

లబ్ధిదారులకు ఊరట!

మంజూరైన ఇళ్లు	ప్రారంభించినవి	బేస్‌మెంట్ వరకు	గోడలు, స్లాబులు పూర్తి	బిల్లుల చెల్లింపు
9,000	6,000	2,000	285	రూ. 20 కోట్లు

- సిమెంట్, స్టీలుపై తగ్గనున్న జీఎస్టీ
- ఇందిరమ్మ ఇంటి నిర్మాణ ఖర్చు ఆదా
- రూ. 10 నుంచి 15 వేల వరకు మిగులు



మెదక్‌జోన్: జీఎస్టీ తగ్గింపుతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కొంత ఊరట కలగనుంది. ఇంటి నిర్మాణాలకు ఉపయోగించే స్టీలు, సిమెంట్ తగ్గింపుతో ఖర్చులు తగ్గనున్నాయి. ఇప్పటివరకు వీటిపై 28 శాతం జీఎస్టీ స్లాబ్ ఉండగా, కేంద్రం 18 శాతానికి తగ్గించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి 180 సిమెంట్ బస్తాలతో పాటు, 1,500 కిలోల స్టీలు అవసరం పడుతుంది. ప్రస్తుతం సిమెంట్ బస్తా ధర మార్కెట్లో రూ. 350 ఉండగా, ఒక్కో బస్తాపై సుమారు రూ. 30 తగ్గే అవకాశం ఉంది. ఈ లెక్కన రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు ఆదా కానుంది. అలాగే స్టీలు టన్ను రూ. 5,500 నుంచి 5,800 వరకు ఉంది. దీనిపై రూ. 8 వేల నుంచి రూ. 9 వేల వరకు ఆదా కానుంది. మొత్తంగా తగ్గిన జీఎస్టీతో ఒక్కో లబ్ధిదారుడికి రూ. 10 నుంచి రూ. 15 వేల వరకు డబ్బులు ఆదా అవుతాయని సమాచారం. తగ్గిన ధరలు ఈనెల 22 నుంచి అమలులోకి రానున్నాయి.

ఇసుక కోసం తప్పని ఎదురుచూపులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ ఇప్పటివరకు ఎక్కడా ఉచితంగా ఇవ్వలేదు. ఒక్కో ఇంటికి 10 ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంది. ట్రాక్టర్ ఇసుక రూ. 3,500 నుంచి రూ. 4 వేల వరకు వెచ్చించి లబ్ధిదారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ లెక్కన కేవలం ఇసుకకే రూ. 35 వేలు నుంచి రూ. 40 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

త్వరలో ఇసుక సరఫరా



జిల్లాలో ఇసుక క్వారీలు లేకపోవడంతో ఇతర జిల్లాల నుంచి తెప్పించి మెదక్, నర్సాపూర్‌లో డంప్ చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే నర్సాపూర్‌కు కొంత ఇసుకను తెప్పించాం. త్వరలో మెదక్‌కు తెప్పించి ప్రజాప్రతినిధులకు అందిస్తాం. సిమెంట్, స్టీలుపై జీఎస్టీ తగ్గింపుతో లబ్ధిదారులకు కొంతమేర ఉపశమనం కలిగే అవకాశం ఉంది.

– మాణిక్యం, హౌసింగ్ పీడీ

నీటి సరఫరాకు అంతరాయం

నర్సాపూర్: ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీరు రావని డీఈఈ ప్రవీణ్‌కుమార్, హత్నూర ఏఈ శివప్రసాద్ తెలిపారు. చక్రియాల్ నుంచి నీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. దీంతో నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్, హత్నూర, వెల్దుర్తి, మాసాయిపేట మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని అన్ని గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. మరమ్మతులు పూర్తి కాగానే నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

సత్వరమే పరిష్కరించాలి
అదనపు కలెక్టర్ నగేశ్



అర్జీలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ప్రజావాణిలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు 56 అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు ప్రజావాణిపై నమ్మకాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.
- ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరైందని, కట్టుకోనివ్వకుండా పాలివాళ్లు అడ్డుకుంటున్నారు. న్యాయం చేయాలని హవేళీఘణాపూర్ మండలం సర్దన గ్రామానికి సాయిలు ప్రజావాణిలో మొరపెట్టుకున్నాడు.
- మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు, ఒక చేయి కోల్పోయాను. ప్రభుత్వం నుంచి పెన్షన్ అందడం లేదని రామాయంపేట పట్టణానికి చెందిన గట్ల శ్రీనివాస్ ప్రజావాణిలో వాపోయారు.

పెన్షన్లు పెంచండి



కలెక్టరేట్ ఎదుట నాయకుల ధర్నా

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు యాదగిరి, పాండు, సైదులు డిమాండ్ చేశారు. దివ్యాంగులు, వృద్ధులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ వచ్చి సమాధానం ఇచ్చే వరకు ధర్నా విరమించేది లేదంటూ బైఠాయించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ నగేశ్‌కు అందజేశారు.

అడవిబాట పట్టిన అధికారులు



నత్నయపల్లి అటవీలో మొక్కలు లెక్కిస్తున్న అధికారులు

నర్సాపూర్ రూరల్: అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలను లెక్కించడానికి అధికారులు సోమవారం అడవిబాట పట్టారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, కాగజ్‌మద్దూర్, గొల్లపల్లి, పెద్ద చింతకుంట, నారాయణపూర్, అచ్చంపేట, ఖాజీపేట, నత్నయ్యపల్లి గ్రామాల అడవుల్లో మొక్కలను పరిశీలించి లెక్కిస్తున్నారు. నర్సాపూర్ అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటకుండానే సుమారు రూ. 19 లక్షల బిల్లులు డ్రా చేసుకున్నట్లు సామాజిక తనిఖీ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అటవీశాఖ అధికారులు మొక్కలు నాటినట్లు ఉన్నతాధికారులకు విన్నవించారు. పూర్తి విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. దీంతో జిల్లాలోని పలు మండలాల ఎంపీడీఓలు, ఏపీఓల బృందం మొక్కలు లెక్కించే పనిలో పడ్డారు.

ప్రమాదం అంచున చిన్నచెరువు



రామాయంపేట(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కాట్రియాల గ్రామాన్ని ఆనుకొని ఉన్న చిన్నచెరువు కట్ట తీవ్రంగా దెబ్బతింది. నాలుగు చోట్ల కోతకు గురై మట్టి కొట్టుకుపోయింది. కలెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు దెబ్బతిన్న కట్టను పరిశీలించారు. కట్ట తెగితే పన్యా తండాకు ప్రమాదం పొంచి ఉండటంతో తండా వాసులను అక్కడి నుంచి పునరావాస కేంద్రానికి తరలించారు. నీటి పారుదలశాఖ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మళ్లీ వర్షం కురిస్తే కట్ట తెగే ప్రమాదం ఉందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. నీటి పారుదల శాఖ ఏఈ సూర్యకాంత్‌ను వివరణ కోరగా, రెండు రోజుల్లో కట్ట మరమ్మతులు ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రతీ ఓటు అమూల్యమైనదే

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్/టేక్మాల్(మెదక్): ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్క ఓటు అమూల్యమైందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 21 జెడ్పీటీసీ, 190 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు సజావుగా జరిగేలా 1,052 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా తదితర విషయాలపై చర్చించారు. జిల్లాలో పురుష ఓటర్లు 2,51,532, మహిళా ఓటర్లు 2,71,787, ఇతరులు 08, మొత్తం 5,23,327 మంది ఓటర్లున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఖచ్చితంగా ఉండాలని తెలిపారు. అభ్యంతరాలు పరిశీలించిన తర్వాత తుది జాబితాను ఈనెల 10న ప్రకటిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, జెడ్పీ సీఈఓ, ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు టేక్మాల్ మండలంలోని దనూర ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతలో రాజీపడకుండా మెనూ అందించాలన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

మెదక్ మున్సిపాలిటీ: ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా 13 మంది తమ తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయగా, వాటిని చట్ట ప్రకారం పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పలు ఉత్సవ కమిటీలపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వినాయక నిమజ్జన ఉత్సవం సందర్భంగా కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించిన పెద్దబజార్‌కు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

పల్లెల ప్రగతికి ప్రాధాన్యం


- మంత్రి దామోదర రాజనర్సింహ
- రూ. 28.45 కోట్ల రోడ్ల పనులకు శంకుస్థాపన

టేక్మాల్(మెదక్): పల్లెల ప్రగతికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం మండలంలో రూ. 28.45 కోట్లతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లోకి రవాణా సౌకర్యం బాగుంటేనే అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. అంతకుముందు కేజీబీవీ, మోడల్ స్కూల్‌ను సందర్శించి మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యార్థులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎల్లుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా బొడ్మట్‌పల్లి, తంప్లూర్ సబ్ సెంటర్లను ఆస్పత్రిలో ఎందుకు కలిపారని వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీవర్ సర్వే పటిష్టంగా అమలు చేయాలని, నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం ప్రజలకు దూరంగా ఉందన్నారు. స్థల సేకరణలో ఇంత నిర్లక్ష్యం ఎందుకు చేశారని, రోడ్డుకు అనుకొని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మించాలని సూచించారు. మంత్రి వెంట కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ తులసీరాం, నాయకులు తదితరులు ఉన్నారు.



దనూరలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర, కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆ అధికారులపై కలెక్టర్ కొరడా!



మెదక్ కలెక్టరేట్: సమయపాలన పాటించని జిల్లా అధికారులపై కొరడా ఝులిపించేందుకు కలెక్టర్ సన్నద్ధం అయ్యారు. అందులో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సకాలంలో హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈమేరకు 33 మందికి నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం.



నార్సింగిలో యూరియా కోసం క్యూలైన్‌లో చెప్పులు ఉంచిన రైతులు

ఏమని చెప్పకోవాలి

నార్సింగి మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. సోమవారం ఉదయమే ఆగ్రోస్ కేంద్రం వద్దకు చేరుకొని చెప్పులను క్యూలో పెట్టారు. 10 గంటలకు యూరియా అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలస్యంగా వచ్చిన రైతులకు దొరకకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. –చిన్నశంకరంపేట(మెదక్)

లక్ష్యం చేరని సీఎంఆర్

- ఈనెల 12తో ముగియనున్న సేకరణ గడువు
- గత ఖరీఫ్ 74.64 శాతం, రబీ 32.83 శాతమే పూర్తి
- మళ్లీ పొడిగించాలంటున్న మిల్లర్లు

గడువు ముంచుకొస్తున్నా.. కస్టమ్స్ మిల్లింగ్ రైస్ శతశాతం లక్ష్యాన్ని చేరుకోలేదు. గత ఖరీఫ్ గడువు ఈనెల 12తో ముగుస్తుంది. కానీ మిల్లర్లు ఇప్పటివరకు 74.64 శాతం బియ్యం మాత్రమే సివిల్ సప్లై శాఖకు ఇచ్చారు. అలాగే గత రబీకి సంబంధించి అక్టోబర్ 31 వరకు గడువు ఉండగా, ఇప్పటివరకు 32.83 శాతం బియ్యం మాత్రమే ఇచ్చారు. ఇక 15 ఏళ్లుగా పేరుకుపోయిన బియ్యం బకాయిలు తడిసి మోపెడయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా రికవరీ కావడం లేదు.

– మెదక్ అర్బన్



జిల్లాలో 37 బాయిల్డ్.. 68 రా రైస్ మిల్లులు ఉన్నాయి. ఖరీఫ్ 2024– 25కు సంబంధించి ఈనెల 12తో సీఎంఆర్ రైస్ గడువు ముగుస్తుంది. ఆ సీజన్‌కు సంబంధించి 2,67,953 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు ఇచ్చారు. వీరంతా ఈనెల 12 వరకు మొత్తం 1,80,453 మెట్రిక్ టన్నుల బియ్యం సివిల్ సప్లై శాఖకు ఇవ్వాలి. కానీ ఇప్పటివరకు 1,34,698 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 45,755 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. అలాగే గత రబీకి సంబంధించి 2,99,888 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు ఇవ్వగా, ఇందులో 2,03,923 మెట్రిక్ టన్నుల బియ్యం రావాలి. కానీ ఇప్పటివరకు 66,944 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. కాగా వీరికి అక్టోబర్ 31 వరకు గడువు ఉంది. అయితే అప్పట్లో ధాన్యం తడవడంతో కొంత మేర ఇబ్బంది ఏర్పడిందని, అందువల్ల గడువు పెంచాలని మిల్లర్లు కోరుతున్నారు. కాగా కొంత మంది మిల్లర్లు సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యం అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

గడువు పెంచాలి



గత ఖరీఫ్‌కు సంబంధించి అప్పట్లో అధికారులు 70 రోజుల గ్యాప్ ఇచ్చారు. ఈ సమయంలో బీహార్ హమాలీలు తమ స్వస్థలాలకు వెళ్లిపోయారు. దీంతో ధాన్యం మర ఆడించడంలో జాప్యం జరిగింది. అలాగే ఇటీవల కురిసిన వర్షాలతో తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల గోదాంలు లేక ధాన్యం తడిసిపోయింది. అందువల్ల గడువు పెంచాలి.

– వీరేశం, రా మిల్లర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి

చర్యలు తీసుకుంటున్నాం



2010 నుంచి మిల్లర్ల దగ్గర సీఎంఆర్‌కు సంబంధించి పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దాదాపు బకాయిదారులందరికీ నోటీసులు ఇచ్చాం. కొంతమంది కోర్టుకు వెళ్లారు. ఆ విషయంలో రిట్ పిటిషన్లు వేస్తున్నాం. అవకాశమున్న రైస్ మిల్లులను యాక్షన్ పెడతాం, వారి ఆస్తుల ద్వారా బకాయిలు వసూలు చేస్తాం.

– జగదీశ్ కుమార్, డీఎం, సివిల్ సప్లై

పేరుకుపోయిన బకాయిలు

2010 నుంచి 2024 వరకు జిల్లాలోని 13 మిల్లర్ల నుంచి సీఎంఆర్ బకాయిల కింద రూ. సుమారు రూ. 214 కోట్లు రావాలి. బకాయిల వసూళ్ల కోసం అధికారులు ఆర్ఆర్‌యాక్ట్ కింద నోటీసులు ఇచ్చారు. కొన్ని మిల్లుల ఆస్తులు యాక్షన్ పెట్టారు. అయితే కొంతమంది కోర్టును ఆశ్రయించారు. వివిధ కారణాలతో బకాయిల వసూళ్లు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ఇందులో కొంతమంది మిల్లర్లు సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యాన్ని బయట అమ్ముకొని రూ. కోట్ల అక్రమార్జనకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. గతేడాది కొన్ని బకాయిలు వసూలు అయినా, ఇంకా పెద్ద మొత్తంలో రావాలని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

సిగాచీ బాధితులకు న్యాయం చేయాలి

నేడు రౌండ్‌ టేబుల్‌ సమావేశం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సిగాచీ పరిశ్రమ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తూ మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని పీఎస్‌ఆర్‌ గార్డెన్స్‌లో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించనున్నట్లు టీపీజేఏసీ కన్వీనర్‌ వై.అశోక్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. సైంటిస్ట్స్‌ ఫర్‌ పీపుల్‌, మానవ హక్కుల వేదిక, తెలంగాణ పీపుల్స్‌ జాయింట్‌ యాక్షన్‌ కమిటీ, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక, అసోసియేషన్‌ ఫర్‌ ప్రొటెక్షన్‌ ఆఫ్‌ సివిల్‌ రైట్‌ వంటి ప్రజా సంఘాలు సంయుక్తంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తోంది. ప్రొఫెసర్‌ హరగోపాల్‌, ప్రొఫెసర్‌ కోదండరాం, జస్టిస్‌ చంద్రకుమార్‌, సైంటిస్ట్‌ డాక్టర్‌ కే.బాబూరావు, ఎంవీఎఫ్‌ కన్వీనర్‌ ఆర్‌.వెంకట్‌రెడ్డి, న్యాయవాది వసుధ నాగరాజ్‌ తదితరులు ఈ రౌండ్‌టేబుల్‌ సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు రిపేర్‌ చేయరూ?

గుండారం రైతుల నిరసన



పొలంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

బెజ్జంకి(సిద్దిపేట): సెస్‌ పరిధిలోని గుండారంలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ కాలిపోయి 15 రోజులైనా రిపేర్‌ చేయకపోవడంతో పంటలు ఎండి పోతున్నాయని బాధిత రైతులు సోమవారం పొలంలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ మార్చడంలో సెస్‌ అధికారుల నిర్లక్ష్యం వల్ల వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సాన వేణు, రైతులు లక్ష్మణ్‌, రాజిరెడ్డి, రమేశ్‌, రమేశ్‌, నాగరాజు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం



రాగి రాజేశం (ఫైల్‌)

బెజ్జంకి(సిద్దిపేట): వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సౌజన్య కథనం ప్రకారం... గాగిళ్లాపూర్‌ గ్రామానికి చెందిన రాగి రాజేశం(45) మద్యానికి బానిసై గత నెల 26న ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. దీంతో అతడి కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్‌ కేసు నమోదు చేశారు. సోమవారం గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. రాజేశం మృతదేహంగా కుటుంబసభ్యులు గుర్తించడంతో పోస్ట్‌మార్టానికి తరలించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ వివరాల ప్రకారం... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 16 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఇద్దరికి రూ.1500, 13 మందికి రూ.వెయ్యి చొప్పున, ఒక్కరికి రూ. 2 వేలు జరిమాన విధించింది.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిన వస్తువులను పరిశీలిస్తున్న ఆర్‌ఐ సునీల్‌సింగ్‌

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన ఫైజాబాద్‌ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తకుంట తండాలో సోమవారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... బానోత్‌ రమేశ్‌ ఇల్లు షాట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో ఇంట్లోని ఫ్రిడ్జ్‌, బీరువాతో పాటు అందులోని దుస్తులు, బియ్యం, రూ. 13 వేలు, పలు వస్తువులు కాలిపోయాయి. గమనించిన చుట్టుపక్కల వారు నీటితో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ఘటనా స్థలాన్ని ఆర్‌ఐ సునీల్‌సింగ్‌ పరిశీలించారు.

ఏడుపాయల షాపుల టెండర్లు ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న నిర్వాహకులు

పాపన్నపేట(మెదక్‌): ఏడుపాయల షాపుల టెండర్లు సోమవారం ఖరారయ్యాయి. 9 షాపులకు రూ. 1 లక్ష డిపాజిట్‌ చెల్లించారు. నెల ఒక్కింటికి రెంట్‌ కోసం సీల్డ్‌ టెండర్లు నిర్వహించారు. ఈ మేరకు పలువురు వేలం పాటలు పాడి టెండర్‌ దక్కించుకున్నారు. ఇదిలాఉండగా చంద్రగ్రహణం అనంతరం సోమవారం వనదుర్గమ్మ దర్శనం ప్రారంభించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



సిద్దిపేట పట్టణంపై కమ్మేసిన కారు మబ్బులు

కారుమబ్బులు కమ్మేసి...

జిల్లా కేంద్రాన్ని సోమవారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులు కమ్మేసి వర్షం కురిసింది. కొద్దిసేపు పాత బస్టాండ్‌ సెంటర్‌, విక్టరీ, ముస్తాబాద్‌ చౌరస్తాల్లో వర్షం జోరుగా కురిసింది. దీంతో విక్టరీ చౌరస్తాలో రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది.

-సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట



విక్టరీ చౌరస్తాలో రోడ్డుపై నిలిచిన నీరు

ఇల్లు కట్టు.. ఫొటో పెట్టు



ఇందిరమ్మ ఇళ్ల పథకం.. మరింత పారదర్శకం

- లబ్ధిదారులకు తప్పనున్న కష్టాలు
- వారి ఇల్లుకు వారే అధికారులు
- 'టీజీహెచ్‌సీఎల్‌' యాప్‌లో ఫొటోల అప్‌లోడ్‌

సిద్దిపేటరూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం.. మరింత పారదర్శకంగా మారింది. ఇకపై అధికారులు ఫొటోలు తీయకుండానే, లబ్ధిదారులే యాప్‌ ద్వారా ఇళ్ల ఫొటోలు అప్‌లోడ్‌ చేసే అవకాశాన్ని కల్పించింది. ఆ ఫొటోలను పరిశీలించి, వాటి ఆధారంగా బిల్లు విడుదల చేయనున్నారు. సకాలంలో ఆర్థిక సహాయం అందుతుంది. ఈ యాప్‌ వినియోగం ఈ నెల 4 నుంచి అమల్లోకి వచ్చింది.

అధికారుల అవసరం లేకుండానే..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్న క్రమంలో అధికారులే వివిధ స్థాయిలలో ఫొటోలు తీశారు. హౌసింగ్‌ ఏఈ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఫొటోలు తీసేవారు. దీంతో లబ్ధిదారులకు బిల్లులు రావడంలో ఆలస్యం అవుతుంది. ప్రస్తుత నూతన యాప్‌ ద్వారా సకాలంలోనే డబ్బులు అందనున్నాయి. లబ్ధిదారులే తమ ఇళ్ల నిర్మాణాల ఫొటోలు నేరుగా ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్‌ చేసుకోనున్నారు. అధికారులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండానే ప్రభుత్వ సాయం అందనుంది.

పథకం అమలు విధానం

మొదటి దశలో ముగ్గులు పోసి.. బేస్మెంట్‌ నిర్మించిన తర్వాత డబ్బులు జమ చేస్తారు. గోడలు నిర్మించిన ఫొటోలు పంపిన తర్వాత రెండో సారి.. పైకప్పు పూర్తయిన తర్వాత మూడో విడత డబ్బులు వస్తాయి. చివరగా ప్రారంభం అనంతరం చివరి బిల్లు వస్తుంది.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలు..

మంజూరైన ఇళ్లు:	13,062
గ్రౌండింగ్‌ అయినవి:	8,593
బేస్మెంట్‌ వరకు:	3,769
గోడల వరకు:	660
స్లాబ్‌ వరకు నిర్మించినవి:	262
వందశాతం పూర్తయినవి:	01

ఫొటోల అప్‌లోడ్‌ ఇలా..

- మొబైల్‌లోని ప్లే స్టోర్‌ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవాలి. బెనిఫిషియరీ లాగిన్‌తో ఓటీపీ ఎంటర్‌ చేయాలి. తర్వాత డాష్‌ బోర్డులో లబ్ధిదారు పేరు, మొబైల్‌ నంబరు తదితర వివరాలతో పాటు ఫొటోలు తీయడం, ఇండ్ల నిర్మాణపు దశలు వంటివి కనిపిస్తాయి.
- లబ్ధిదారు ఇంటి నిర్మాణ దశను ఫొటో అప్‌లోడ్‌ చేయాలి. మ్యాప్‌ సింబల్‌ను క్లిక్‌ చేసి వివరాలు నమోదు చేయాలి. ఒకసారి సరిచూసుకున్న తరువాత సబ్మిట్‌ చేసి, గ్రౌండింగ్‌ బటన్‌పై క్లిక్‌ చేస్తే వివరాలన్నీ కనిపిస్తాయి.
- బేస్మెంట్‌ స్థాయిలో, నిర్మాణపు పనులు జరుగుతున్న ఇంటి వద్ద లబ్ధిదారుతో పాటు నలువైపులా ఫొటోలు తీయాలి. ఈ ఫొటోలు ఇంటి ప్రాంతం నుంచే తీసి, వివరాలు నమోదు చేసి సబ్మిట్‌ చేయాలి. గ్రామ కార్యదర్శులు, ఎంపీడీఓలు, డీఈఈలు, పీడీలు తదితర అధికారులు, వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకున్న తరువాతనే లబ్ధిదారులకు బిల్లులు అందిస్తారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు, పేమెంట్‌, ఇతర సమస్యలపై టోల్‌ఫ్రీ 18005 995991 నంబర్‌ను సంప్రదించవచ్చు.

పారదర్శకత కోసమే..



ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అందించేందుకు ఈ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇల్లు నిర్మించుకునే వారు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. యాప్‌పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి సాంకేతిక సమస్య ఎదురైనా టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చు.

- జయదేవ్‌ఆర్యా, హౌసింగ్‌ పీడి, సిద్దిపేట

ఇళ్ల నిర్మాణాలకు అనుమతివ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం



తహసీల్దార్‌ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కొండాపూర్‌(సంగారెడ్డి): ఇళ్ల స్థలాల పొజిషన్‌ కలిగి పట్టా సర్టిఫికెట్లు ఉన్న వారికి ఇంటి నిర్మాణాలకు అనుమతివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాణిక్యం ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం కొండాపూర్‌లోని తహసీల్దార్‌ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల పరిధిలోని గంగారంలో సర్వే నంబర్‌ 1,5,243లోని ప్రభుత్వ భూమిలో నిరుపేదలకు సుమారు 100 మందికి రెండేళ్ల క్రితం ప్రభుత్వాధికారులు ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి పొజిషన్‌ చూపెట్టారన్నారు. గత రెండేళ్లుగా ఇంటి నిర్మాణం కోసం పర్మిషన్లు ఇవ్వాలని కోరగా అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ఆందోళన చేయాల్సి వస్తుందని తెలిపారు. అధికారులిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీనికి తహసీల్దార్‌ స్పందిస్తూ మంగళవారం గంగారంలో పర్యటించి అనుమతులు వచ్చేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

యాసంగికి ఇప్పుడే కొంటున్నారు

- ఫలితంగానే యూరియా కొరత
- ఆర్డీఓ జయచంద్రారెడ్డి వెల్లడి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్‌/చేగుంట: మార్కెట్లో యూరియా కొరతను గుర్తించిన కొందరు రైతులు యాసంగి పంట కోసం ఇప్పటి నుంచే యూరియా కొనుగోలు చేస్తున్నారని ఆర్డీఓ జయచంద్రారెడ్డి తెలిపారు. సోమ వారం తన కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధి కారి దేవకుమార్‌, పోలీసులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలో యూరియా కొరతను దృష్టిలో పెట్టుకొని కొందరు యాసంగి పంట కోసం యూరియాను కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నా రు. ఈ విధంగా కొనుగోలు చేస్తే బ్లాక్‌ మార్కెట్‌ చేస్తున్నట్లు భావించాల్సి వస్తుందని హెచ్చరించా రు. రైతులు తమ భూమి విస్తీర్ణానికి సరిపడా యూ రియా బస్తాలు మాత్రమే కొనుగోలు చేయాలని, దానికి అనుగుణంగానే టోకెన్లు జారీ చేసి యూరి యా బస్తాలు పంపిణీ చేస్తున్నారని వివరించారు. సమావేశంలో సీఐ రంగకృష్ణ, ఎస్‌ఐ శివానందం, మండల వ్యవసాయాధికారి గంగుమల్లు పాల్గొన్నారు. అనంతరం చేగుంట తహసీల్దార్‌ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు.

పేలిన వంట గ్యాస్‌ సిలిండర్‌

అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



పేలుడు ధాటికి ధ్వంసం అయిన ఇల్లు

కౌడిపల్లి(నర్సాపూర్‌): సిలిండర్‌ పేలడంతో ఇల్లు ధ్వంసం అయింది. కుటుంబ సభ్యులు ప్రమాదాన్ని పసిగట్టి బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈసంఘటన మండలంలోని ముట్రాజ్‌పల్లిలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్‌ తల్లి ఇటీవల చనిపోవడంతో సోమవారం ఏడో నెల మాసికం నిర్వహిస్తున్నారు. దీనికి బంధువులు సైతం వచ్చారు. ఇంట్లో పిండి వంటలు చేస్తున్నారు. పక్క గదిలో మరో గ్యాస్‌ సిలిండర్‌ ఉంది. ఇంతలో గ్యాస్‌ లీకై వాసన రావడంతో శ్రీనివాస్‌ అప్రమత్తమై ఇంట్లో ఉన్న వారందరిని బయటకు తీసుకొచ్చాడు. ఆసమయంలో ఇంట్లో సుమారు 20 మంది వరకు ఉన్నారు. ఇంతలో ఒక్కసారిగా భారీ శబ్ధంతో సిలిండర్‌ పేలింది. ఇంటిలో స్లాబ్‌ పెచ్చులు ఊడిపడి, గోడలు బీటలు వారాయి. ఈసంఘటనతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. తహసీల్దార్‌ కృష్ణ, ఆర్‌ఐ శ్రీహరి ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌ సుహాసినిరెడ్డి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ట్రాక్టర్‌ బోల్తా

శివ్వంపేట(నర్సాపూర్‌): ట్రాక్టర్‌ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన తూప్రాన్‌-నర్సాపూర్‌ రహదారి శివ్వంపేట గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. దొంతి నుంచి శివ్వంపేటకు కంకర లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు డ్రైవర్‌ నరేష్‌కు ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడిన ట్రాక్టర్‌ ఇంజన్‌ను జేసీబీతో తొలగించారు. అనంతరం వాహన రాకపోకల ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా అడ్డుకోండి

అక్కన్నపేట(హుస్నాబాద్‌): మండలంలోని పునరావాస కాలనీలో ఉన్న సుమారు 9 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జాకు యత్నిస్తున్నారని సోమవారం ఎంపీడీఓ జయరాంకు పలువురు నిర్వాసితులు ఫిర్యాదు చేశారు. మండల ప్రజాపరిషత్‌ కార్యాలయంలో స్థానిక ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. అనంతరం గుడాటిపల్లి మాజీ సర్పంచ్‌ బద్దం రాజిరెడ్డి, రాజునాయక్‌ మాట్లాడుతూ.. పునరావాస కాలనీలో ఇటీవల నూతన జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ చేయగా, ఆ స్థలాన్ని కబ్జా చేయాలని పనులు జరగకుండా పలువురు కుట్ర పన్నుతున్నారన్నారు. ఈ విషయం మంత్రి పొన్నం ప్రభాకర్‌ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఇప్పటికైనా కలెక్టర్‌ ప్రత్యేక దృష్టి సారించి జీపీ భవన నిర్మాణ పనులకు నెలకొన్న అడ్డంకులను తొలగించాలని కోరారు.

అక్రమ అరెస్టులు తగదు

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌

కౌడిపల్లి(నర్సాపూర్‌): మాలకులస్తులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌ ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ మాలమహానాడు పిలుపు మేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్‌ చేయడం అప్రజాస్వామ్యమని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణలో కాంగ్రెస్‌ ప్రభుత్వం మాల కులస్తులకు తీవ్రఅన్యాయం చేస్తుందన్నారు. జీఓ 99ని సవరించి రోస్టర పాయింట్లు 22నుంచి 16కు తగ్గించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు శివ, భూషణం, ప్రకాష్‌, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌ పెంచాల్సిందే

సిద్దిపేట కలెక్టరేట్‌ ఎదుట పెన్షన్‌దారుల ధర్నా



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న వికలాంగులు, పెన్షన్‌దారులు

సిద్దిపేటరూరల్‌: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెంటనే రూ.6వేలకు పెన్షన్‌ పెంచాలని దివ్యాంగులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం వికలాంగుల హక్కుల పోరాటసమితి, ఎమ్మార్పీఎస్‌, పెన్షన్‌దారుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన వారికి నూతన పెన్షన్లు అందించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్‌ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌ దండు శంకర్‌, కో ఇన్‌చార్జి యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ ఒక ఉపాధ్యాయుడితో సమానం

- ఎంపికైన 60 ప్రభుత్వ పాఠశాలలకు
- 3 ట్యాబ్‌లు : డీఈఓ

మెదక్‌ కలెక్టరేట్‌: ఒక ట్యాబ్‌ ఒక ఉపాధ్యాయుడితో సమానమని, ఈ లర్నింగ్‌ ప్రోగ్రాంలో ఈ ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగ పడుతాయని డీఈఓ రాధాకిషన్‌ తెలిపారు. సోమవారం మెదక్‌ కలెక్టరేట్‌లో మేఘశాల అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా జిల్లాలోని 60 పాఠశాలలకు 180 ట్యాబ్‌లను డీఈఓ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఈ లర్నింగ్‌ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థ కృషి చేయడం అభినందనీయమన్నారు. తక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో ఈ ట్యాబ్‌ల ద్వారా బోధన ఎంతో సులభంగా ఉంటుందని, అలాంటి పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం మేఘశాల సంస్థ ప్రతినిధులు ప్రశాంత్‌రెడ్డి, జయలక్ష్మి మాట్లాడుతూ... ఈ ఏడాది మెదక్‌ (60), సిద్దిపేట(45), యాదాద్రి భువనగిరి (45)ల చొప్పున పాఠశాలలను ఎంపిక చేసి ఒక్కో పాఠశాలకు 3 ట్యాబ్‌లను అందజేసినట్లు చెప్పారు. వీటికి ఎలాంటి ఇంటర్నెట్‌ అవసరం ఉండదని, ఆఫ్‌లైన్‌లోనే విద్యార్థులకు పాఠాలు బోధించవచ్చునని తెలిపారు. 'ఒక్కో పాఠశాలలో 6,7,8 తరగతులకు గణితం, సైన్స్‌, సోషల్‌ సబ్జెక్టులు నిక్షిప్తం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ మానిటరింగ్‌ అధికారి సుదర్శన్‌మూర్తి, జిల్లా సైన్స్‌ అధికారి రాజిరెడ్డి, మెదక్‌ ఎంఈఓతోపాటు మేఘశాల ప్రతినిధులు సత్యప్రియ జిల్లాలో ఎంపికై న 60 పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్యాబ్‌లు అందుకున్న ఉపాధ్యాయులతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కుంగిన కాళేశ్వరంతో మూసీకి నీళ్లెట్లొస్తాయి?

- సీఎం రేవంత్‌ రెడ్డి క్షమాపణ చెప్పాలి
- బీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ



మాట్లాడుతున్న రాధాకృష్ణ శర్మ

సిద్దిపేటజోన్‌: కుంగిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మూసీ ప్రక్షాళనకు గోదారి నీళ్లు ఎలా వస్తాయని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ ప్రశ్నించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రూ.7500 కోట్లతో మూసీ ప్రక్షాళన కోసం పథకం రూపకల్పన చేసిందన్నారు. దానికి సీఎం రేవంత్‌ రెడ్డి గండిపేట వద్ద శంకుస్థాపనకు ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. మల్లన్న సాగర్‌ దండగ ప్రాజెక్టు వృథా అని ఆరోపణలు చేసిన సీఎం మల్లన్న సాగర్‌ నుంచి 250 టీఎంసీల నీళ్లు హైదరాబాద్‌కు పంపింగ్‌ చేసేలా ప్రణాళికలు తయారు చేసినట్టు ఆరోపించారు. శంకుస్థాపన కంటే ముందు కొమురవెల్లి మల్లన్న దేవాలయంలో తప్పు ఒప్పుకుని కేసీఆర్‌, తెలంగాణ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రభుత్వం కాళేశ్వరం అంశంపై సీబీఐ విచారణకు సూచనలు చేసిందని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మోహన్‌లాల్‌, నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌,ఎల్లారెడ్డి, ప్రభాకర్‌ వర్మ పాల్గొన్నారు.

కొడుకుకు సంతానం కాలేదన్న ఆవేదనతో..

తల్లి ఆత్మహత్య



రాజవ్వ (ఫైల్‌)

కొమురవెల్లి(సిద్దిపేట): తన కొడుకుకు సంతానం కలుగడం లేదని ఆవేదన చెందిన తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన పొట్ల చెరువు రాజవ్వ(50) తన ఒక్కగానొక్క కొడుకుకు వివాహమై నాలుగేళ్లవుతుంది. అయితే కుమారుడికి సంతానం కావడం లేదు. దీంతో ఆవేదన చెందిన తల్లి రాజవ్వ గత రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రపోయింది. తెల్లవారుజామున లేచి మొదటి అంతస్తులో ఉరి వేసుకుంది. ఉదయం కిందికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పైకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని చనిపోయి ఉంది.

వదిన మృతి చెందిన ఐదు రోజులకే..

- నీటిలో మునిగి మరిది మృతి
- ఝాన్సిలింగాపూర్‌ విషాదం



ప్రభాకర్‌ (ఫైల్‌)



పుష్ప (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): వదిన మృతి చెందిన సరిగ్గా ఐదు రోజులకే ప్రమాదవశాత్తు మరిది మృతి చెందడంతో మండలంలోని ఝాన్సిలింగాపూర్‌లో విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త పుష్ప (45) అనారోగ్యంతో గత గురువారం మృతి చెందారు. సోమవారం ఆమె కుటుంబ సభ్యులు ఐదోరోజు కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు పుష్ప భర్త శ్రీనివాస్‌, మరిది ప్రభాకర్‌, ఇతర కుటుంబ సభ్యులు తలనీలాలు ఇచ్చారు. ఈక్రమంలో సమీపంలోనే ఉన్న గర్గుల కుంటలో స్నానానికి దిగిన ప్రభాకర్‌ నీటిలో మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు రక్షించడానికి విఫలయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు అతని మృతదేహాన్ని చెరువులోంచి తీశారు. ఐదు రోజుల వ్యవధిలోనే వదిన, మరిది మృతి చెందడంతో ఆకుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. మృతుడు ప్రభాకర్‌కు భార్య ఎల్లవ్వతోపాటు 15 ఏళ్లలోపు ముగ్గురు కుమారులున్నారు. ఎస్‌ఐ బాల్‌రాజ్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి దారుణ హత్య



సంఘటన స్థలంలో జయప్రకాశ్‌ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): యువకుడిని దారుణంగా హత్య చేసి ఇంటి ముందే పడేసిన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఒంగోలు పట్టణానికి చెందిన జయప్రకాశ్‌ (22) బొల్లారం కేబీఆర్‌ కాలనీలో ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మరునాడు ఉదయం తన ఇంటి ముందే హత్యకు గురై కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కాళ్లు, ముక్కు, తలపై గాయాలను గుర్తించిన పోలీసులు దుండగులు హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్‌ సంఘటనా స్థలిని సందర్శించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు క్లూస్‌ టీం సభ్యులు విచారణ ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్‌ ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

టేక్మాల్‌(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని బొడ్మట్‌పల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు కథనం ప్రకారం.. అందోల్‌ మండలం మన్సానిపల్లికి చెందిన కాద్లూర్‌ సాంసన్‌, పెద్దాపూర్‌కు చెందిన గర్వగల్ల లలిత బైక్‌పై బొడ్మట్‌పల్లి వైపు వెళ్తూ హైవేపై రోడ్డు క్రాస్‌ చేస్తున్న సమయంలో బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు వెలుతున్న కారు అతివేగంగా వచ్చి వీరిని ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న సాంసన్‌కు కాలు విరగగా, లలితకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్‌లు క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.